# అమరావతికి మరో ముఖద్వారం

- ఈ-13 రోడ్డుపై ఆర్వోబీకి ఏర్పాట్లు
- ఎయిమ్స్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై కీలక సమావేశం
- 3.34 ఎకరాల భూమి అవసరం, 609 మీటర్ల వంతెనకు ప్రతిపాదనలు

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాజధాని అమరావతికి మరో కీలక ముఖద్వారంగా అభివృద్ధి చేస్తున్న ఈ-13 రహదారిపై ఎయిమ్స్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమి, నిర్మాణ అంశాలపై అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి శుక్రవారం మంగళగిరి ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అహంతామ్ శాంతా సింగ్‌తో ఆయన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. ఎయిమ్స్ అధికారులు ఈ అభివృద్ధి పనులకు సానుకూలంగా స్పందించారు. నీరుకొండ నుంచి ఎర్రబాలెం వరకు ఈ-13 రహదారి 6.3 కి.మీ. మేర ఉంది. భవిష్యత్తు రాజధాని ట్రాఫిక్, రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎర్రబాలెం నుంచి ఎయిమ్స్ మీదుగా విజయవాడ-గుంటూరు మార్గంలోని హైవే ఎన్‌హెచ్-16 వరకు మరో 3.52 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నారు. దీంతో ఈ-13 మొత్తం పొడవు -9.82 కి.మీ.కు చేరనుంది.

### ఎయిమ్స్ వద్ద 609 మీటర్ల ఆర్వోబీ

ఈ-13 రహదారి పొడిగింపులో భాగంగా ఎయిమ్స్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదించారు. సుమారు 609 మీటర్ల పొడవుతో ఆర్వోబీ నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో సుమారు 250 మీటర్ల విస్తీర్ణానికి ఎయిమ్స్ నుంచి భూమి అవసరం కానుంది. ఆర్వోబీ నిర్మాణానికి ఎయిమ్స్ ఆసుపత్రికి చెందిన 3.34 ఎకరాల భూమి అవసరం కావడంతో ఏడీసీ, ఎయిమ్స్ అధికారులు ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. రాజధాని భవిష్యత్తు రవాణా అవసరాలు, కనెక్టివిటీని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ఈ పనులకు ఎయిమ్స్ అధికారులు సానుకూలంగా స్పందించారు.సమావేశంలో ఏడీసీ చీఫ్ ఇంజినీర్ బి.నరసింహమూర్తి, సూపరింటెండింగ్ ఇంజినీర్ బి.శ్రీనివాస్, ఎయిమ్స్ ఉపసంచాలకులు శశికాంత్ పాల్గొన్నారు.

# జిల్లాల వారీగా నీటి ప్రణాళికలు



- 2027 జూన్ వరకు నీటిని పొదుపుగా వాడాలి
- తాగునీటి అవసరాలు తీరిన తర్వాతే ఆరుతడి పంటలకు
- సమన్వయంతో నీటి వినియోగంపై పర్యవేక్షణ
- గోదావరి డెల్టాలో మాత్రమే ఖరీఫ్ వరికి నీరు
- మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఎల్‌నినో, సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో నీటి వినియోగంపై ప్రభుత్వం అప్రమత్తమైంది. తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రం సూచనల మేరకు, అందుబాటులో ఉన్న జలాలను పొదుపుగా వినియోగించుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన జలవనరుల శాఖ సమీక్షలో ఎల్‌నినో పరిస్థితులు, తాగునీటి అవసరాలు, సాగునీటి వినియోగంపై ప్రత్యేకంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని జిల్లాల వారీగా ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు.

### నీటి లభ్యతను బట్టి వరిసాగు..

ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని ముందుగా తాగునీటి అవసరాలకు కేటాయించాలని, ఆ తర్వాతే మిగిలిన నీటిని ఆరుతడి పంటలకు వినియోగించాలని మంత్రి నిమ్మల స్పష్టంచేశారు. నీటి లభ్యతను బట్టి వరి సాగు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో గోదావరి డెల్టాకు మాత్రమే వరి సాగుకు నీరు అందిస్తున్నామని, తెలిపారు. ఇతర ప్రాంతాల్లో తాగునీటికి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ప్రతి జిల్లాలో నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్ల ఆధ్వర్యంలో నీటి లభ్యత, వినియోగంపై నిరంతరం సమీక్షించాలని సూచించింది. ప్రజలు, రైతులకు నీటిపరిస్థితిపై ముందుగానే అవగాహన కల్పించాలని మంత్రి తెలిపారు.

### వేగంగా పోలవరం పనులు

పోలవరం పనులను వేగవంతం చేసి 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకెళ్లేందుకు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ నెలాఖరులోగా ఎల్ఎంసీ నుంచి నీటిని విడుదల చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న గూగుల్, ఇతర డేటా సెంటర్లకు ఏడాదికి సుమారు 3 టీఎంసీల నీరు అవసరమవుతుందని మంత్రి తెలిపారు. ఈ నీటిని పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా అందించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. రాష్ట్రంలోని 36 ప్రాధాన్య జలవనరుల ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని, ప్రతి ప్రాజెక్టుకు నెలవారీ ప్రణాళిక రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని నిమ్మల వివరించారు.

### లిఫ్ట్ పథకాలకు పునరుజ్జీవం

రాష్ట్రంలోని లిఫ్ట్ పథకాలను కూడా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతంలో 1,040 లిఫ్ట్ పథకాలు ఉండగా పూర్తిస్థాయిలో పనిచేసినవి కేవలం 150 మాత్రమేనని మంత్రి తెలిపారు.

ఈ పథకాల ద్వారా సుమారు 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేదని చెప్పారు. లిఫ్ట్ పథకాలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని మరమ్మతులు చేయడంతో పాటు పదేళ్లపాటు నిర్వహణ బాధ్యతను కూడా ప్రభుత్వమే చేపట్టేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# రాజధానికి మరో 'వరద' రక్షణ

- రెండో పంపింగ్ స్టేషన్‌కు భూమిపూజ
- 2028 ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాజధాని అమరావతికి వరద ముప్పును మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కొండవీటివాగు వద్ద రెండో వరద నియంత్రణ పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ పనులకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. 8,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యంతో నిర్మించే ఈ స్టేషన్‌లో 12ప్లస్1 చొప్పున మొత్తం 13 పంపులను ఏర్పాటు చేయనున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జి నుంచి నీటిని పంపింగ్ స్టేషన్‌కు తరలించి, అక్కడి నుంచి కృష్ణానదిలోకి ఎత్తిపోస్తారు. దీంతో ప్రస్తుతం ఉన్న పంపింగ్ స్టేషన్‌కు అదనంగా మరో వ్యవస్థ అందుబాటులోకి వచ్చి వరద నీటి పారుదల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్, ఎండీ డి.లక్ష్మీ పార్థసారథి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి, 2028 ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కొత్త పంపింగ్ స్టేషన్‌తో రాజధాని అమరావతి వరద నియంత్రణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.

# దేశంలోనే ప్రముఖ సినీ హబ్‌గా ఏపీ

- విశాఖలో కొరియన్ కనకరాజు సక్సెస్ మీట్
- రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



**విశాఖపట్నం-ఆంధ్రప్రభబ్యూరో :** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ సినీ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన 'కొరియన్ కనకరాజు' గ్రాండ్ సక్సెస్ మీట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నటుడు వరుణ్‌తేజ్ తన కెరీర్‌లోనే అత్యంత పరిణితితో కూడిన నటనను ఈ చిత్రంలో ప్రదర్శించారని ప్రశంసించారు. పూర్తి వినోదాత్మక పాత్రతో పాటు పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలోని విభిన్న కోణాలను అద్భుతంగా ఆవిష్కరించారని అన్నారు. మెగా కుటుంబం నుంచి వచ్చిన నటనా వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వరుణ్‌తేజ్.. ఈ చిత్రంతో మరోసారి తన నటనా ప్రతిభను చాటుకున్నారని పేర్కొన్నారు. కమెడియన్ సత్య తనదైన కామెడీతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారని, హీరోయిన్ రితికా నాయక్ ప్రతి ఫ్రేమ్‌లోనూ మెప్పించేలా నటించారని మంత్రి తెలిపారు. వరుణ్‌తేజ్, సత్య, రితికా నాయక్‌ల కలయిక ప్రేక్షకులను అలరించిందన్నారు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలతో నిరంతరం ఒత్తిడిలో ఉండే ప్రజాప్రతినిధులు సైతం ఈ వినోదాత్మక చిత్రాన్ని ఆస్వాదించడం సినిమా విజయానికి నిదర్శన మన్నారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు.


డబ్బింగ్ థియేటర్లు, రీ-రికార్డింగ్ స్టూడియోలు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు నిర్మాతలు, పారి శ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారికి అవసరమైన భూమితో పాటు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. కళాకారుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విజన్‌తో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమన్వయంతో రాష్ట్రంలో సినీ పరిశ్రమకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు.'కొరియన్ కనకరాజు' చిత్రీకరణ అనంతపురం పరిసర ప్రాంతాల్లో జరగడం, రాయలసీమ యాస, నేటివిటీని సినిమాలో చక్కగా ప్రతిబింబించడం అభినందనీయమని మంత్రి అన్నారు. అద్భుతమైన కథ, పటిష్టమైన స్క్రీన్‌ప్లేతో సినిమాను రక్తికట్టించిన దర్శకుడు మేర్లపాక గాంధీతో పాటు నిర్మాతలు రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడిలను ప్రత్యేకంగా అభినందించారు.

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతోనే తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టానని, ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని దుర్గేష్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. సహచర ప్రజాప్రతినిధి, ఎమ్మెల్సీ నాగబాబుతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సినీ పరిశ్రమకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో సినీ నిర్మాణానికి అనుకూల వాతావరణం కల్పించి, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ శాసన సభ్యులు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణశ్రీనివాస్, సుందరపు విజయ్‌కుమార్ తదితరులంతా పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో హడావుడి వద్దు

- ఉద్యోగుల హక్కులను పరిరక్షిస్తూ పారదర్శకంగా కేటాయింపులు చేపట్టాలి
- ఆగస్టు 31 వరకు పదోన్నతులకు అవకాశం కల్పించాలి
- ఏపీ జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు డిమాండ్



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలులో ఉద్యోగుల హక్కులను పరిరక్షిస్తూ, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే స్థానిక కేడర్లకు ఉద్యోగులను కేటాయించాలని ఏపీ జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం ఇచ్చిన 27 నెలల గడువును వినియోగించుకుని హడావుడి లేకుండా చట్టబద్ధంగా, పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జీఏడీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సూచనలను వినతిపత్రం రూపంలో జీఏడీ ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్‌కు అందజేశారు. ఉద్యోగుల కేటాయింపులో సీనియారిటీ, కేడర్ బలం, పదోన్నతులు, ఖాళీలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, సంబంధిత శాఖలు, ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరపాలని కోరారు. జాబ్ క్యాలెండర్ పేరుతో కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయడం, పదోన్నతులపై విధించిన నిషేధాన్ని కొనసాగించడం సరికాదని పేర్కొన్నారు. ఆగస్టు 31 వరకు పదోన్నతులకు అవకాశం కల్పించాలని, తుది సీనియారిటీ జాబితా విడుదలకు ముందు అభ్యంతరాలు తెలిపేందుకు కనీసం 15 రోజుల గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రిఫరెన్స్ జాబితాలో ప్రస్తుతం 70 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు మాత్రమే అవకాశం కల్పించడం వల్ల నష్టం జరుగుతుందని, ఆ పరిమితిని 40 శాతానికి తగ్గించాలని కోరారు. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు భవిష్యత్ ప్రభుత్వ ఉద్యోగుల సేవా నిర్మాణంపై ప్రభావం చూపే కీలక ప్రక్రియ కావడంతో ఉద్యోగ సంఘాలతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ పారదర్శకంగా అమలు చేయాలని ఏపీ జేఏసీ విజ్ఞప్తి చేసింది.

# పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు కౌన్సెలింగ్

- పరిశీలించిన ఎన్జీ రంగా వీసీ సత్యనారాయణ



**అమరావతి, ఆంధ్రప్రభ :** గుంటూరు జిల్లా లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం కృష్ణా ఆడిటోరియంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల మాన్యువల్ మాప్‌అప్, స్పాట్ కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించారు. ఈ ప్రక్రియను విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, వ్యవసాయ ఇంజనీరింగ్, సేంద్రియ వ్యవసాయం, విత్తనాభివృద్ధి వంటి రంగాల్లో డిప్లొమా విద్యకు మంచి ప్రాధాన్యత ఉందన్నారు. ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు చేరవేయడంలో డిప్లొమా విద్యార్థులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. డిప్లొమా పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విత్తన కంపెనీలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఉన్నత విద్యకు కూడా మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపైనా విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియలో భాగంగా ఆగస్టు 10న ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అభ్యర్థులకు మాన్యువల్ మాప్‌అప్ కౌన్సిలింగ్, ఆగస్టు 14న నమోదు చేసుకున్నవారితో పాటు నమోదు చేయని అభ్యర్థులకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కౌన్సిలింగ్ పారదర్శకంగా, సజావుగా సాగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎ. మణి, వ్యవసాయ కళాశాలల డీన్ డా. చెరుకూరి శ్రీనివాసరావు, వ్యవసాయ ఇంజనీరింగ్ డీన్ డా. పి.వి.కె. జగన్నాథరావు, పాలిటెక్నిక్ డైరెక్టర్ డా. ఎన్.సి. వెంకటేశ్వర్లు, జాయింట్ రిజిస్ట్రార్ ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తీవ్ర సంక్షోభంలో తెలంగాణ విద్యా వ్యవస్థ

- ప్రభుత్వాలు మారినా విద్యారంగంలో మార్పు రావట్లేదు
- తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆకునూరి మురళి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని విద్యా కమిషన్ మాజీ ఛైర్మన్ ఆకునూరి మురళి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల పాలకుల నిర్లక్ష్యం, ప్రైవేట్ విద్యాసంస్థల అడ్డగోలు దోపిడీతో సామాన్య ప్రజలు విద్యకు దూరమవుతున్నారని ఆయన విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ పీపుల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకునూరి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ ఫీజులు, బిల్డింగ్ ఫండ్స్, ఈవెంట్ల పేరుతో తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్నాయని మండిపడ్డారు. నాన్-ప్రాఫిట్ సొసైటీలుగా రిజిస్టర్ అయి, విద్యను పూర్తిస్థాయి వ్యాపారంగా మార్చేశారని ఆరోపించారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 42 వేల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యంగా 82 శాతం ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులకు బోధించాల్సిన (మల్టీ గ్రేడ్ టీచింగ్) దారుణ పరిస్థితి ఉందన్నారు.

ఎన్నికల సమయంలో లబ్ధి పొందేందుకు ఒకటి రెండు స్కూళ్లను బాగు చేసి, దాన్నే పెద్ద మార్పుగా చూపించే టోకెనిజం రాజకీయాలను ఆయన తప్పుపట్టారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యత లేకపోవడం వల్లే 70 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ బాట పడుతున్నారని గుర్తు చేశారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు అత్యల్పంగా ఉన్నాయని మురళి పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 15 శాతం హామీ ఇచ్చినా, ప్రస్తుతం 8 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని, అందులో 95 శాతం జీతాలకే సరిపోతోందని వివరించారు. కొఠారి కమిషన్ సూచనల ప్రకారం విద్యకు 18 నుండి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని, ఢిల్లీ వంటి రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వాలు మారినా విద్యారంగంలో ఆశించిన మార్పు రావడం లేదని, అందుకే తల్లిదండ్రులు ఒక ప్రెషర్ గ్రూపుగా ఏర్పడాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యను ఎన్నికల అజెండాగా మార్చినప్పుడే పాలకుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని ఆకునూరి మురళి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్‌లు, లైబ్రరీలు, సెక్యూరిటీ వంటి కనీస వసతులు కల్పిస్తే విద్యార్థులు మళ్లీ సర్కారు బడులకే వస్తారని ఆకునూరి మురళి అన్నారు.

# దొడ్డిదారిలో కంకరను తరలించారు

- భూపతిపాలెం రిజర్వాయర్‌లో మెటల్ అక్రమాలపై విచారణ

**అమరావతి, ఆంధ్రప్రభ:** తూర్పుగోదావరి జిల్లా భూపతిపాలెం రిజర్వాయర్ ప్రాజెక్టు మిగులు 40 ఎంఎం మెటల్ విక్రయంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై నలుగురు రిటైర్డ్ గనుల శాఖ అధికారులపై కొనసాగుతున్న క్రమశిక్షణ విచారణకు ప్రభుత్వం విచారణాధికారిని నియమించింది. అదనపు డీఎంజీ డి. శ్రీనివాసరావును విచారణాధికారిగా నియమిస్తూ పరిశ్రమలు, వాణిజ్య (విజిలెన్స్) శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం, కాకినాడలో పనిచేసిన ఏడీఎంజీ, డీవైడీఎంజీ స్థాయి నలుగురు మాజీ అధికారులపై వచ్చిన ఆరోపణలను సమగ్రంగా విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. 2014 విజిలెన్స్ నివేదిక, అనంతరం ప్రభుత్వ ఉత్తర్వులు, గనుల శాఖ డైరెక్టర్ నివేదికల ఆధారంగా విచారణ ప్రక్రియను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.

# జనగణనలో అడగాల్సిన 40 ప్రశ్నలు

### నోటిఫై చేసిన ప్రభుత్వం

**న్యూఢిల్లీ :** హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, లద్దాఖ్‌లతో పాటు కొన్ని ప్రాంతాల్లో సెప్టెంబర్ 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుంది. ఈ క్రమంలోనే జనగణనలో అడగాల్సిన 40 ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసింది. వీటిలో కులం, కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం వంటి అంశాలు ఉన్నాయి. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఈ ప్రాంతాలలో జనాభా గణన సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జరుగుతుంది. అంతకముందే, ఆగస్టు 17 నుంచి 31 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఉపయోగపడే సెల్ఫ్ ఎన్యూమరేషన్ (ఎస్ఈ) పోర్టల్‌ను, జనగణనకు సంబంధించి పరిపాలనా పరమైన పర్యవేక్షణకు సాయపడే సెన్సస్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్‌ను కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చింది. కాగా.. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనగణన వచ్చే ఏడాది ప్రారంభమవుతుంది.

# సాగరతీరంలో విభజన విషాద స్మృతి దివస్

- బీజేపీ ఆధ్వర్యంలో భారీ కాగడా ర్యాలీ
- ప్రాణాలు కోల్పోయిన వారికి ఘన నివాళి



**విశాఖపట్నం-ఆంధ్రప్రభబ్యూరో:** దేశ విభజన సమయంలో ప్రాణాలు కోల్పోయిన లక్షలాది మంది అమరులకు నివాళులర్పిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి భారీ కాగడా ర్యాలీ నిర్వహించారు. సాగరతీరంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి. బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత అమరులకు ఘనంగా నివాళులర్పించిన అనంతరం దేశ విభజన సందర్భంగా చోటు చేసుకున్న హింస, అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారి త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కాగడాలు చేతబూని బీచ్‌రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విభజన విషాదాన్ని భవిష్యత్ తరాలు మరువకూడదనే ఉద్దేశంతో ప్రతి ఏడాది ఆగస్టు 14న విభజన విషాద స్మృతి దినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటి పరిస్థితుల్లో కుటుంబాలను, స్వస్థలాలను కోల్పోయిన వారి బాధలను స్మరించుకుంటూ వారికి గౌరవం ఇవ్వడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కాగడాల వెలుగులో సాగిన ర్యాలీతో బీచ్‌రోడ్డులో దేశభక్తి వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో బీజేపీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి మధు కర్‌జీ,రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కేశవ్‌కాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చొక్కాకుల వెంకటరావు,జిల్లా అధ్యక్షులు పరుశరామ రాజు, బీజేపీ నాయకులు, బీజేవైఎం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఎస్ఎస్ఎఫ్ లిమిటెడ్**

సిఐఎన్:ఎల్05001ఎపి1968పిఎల్‌సి094913

నమోదిత కార్యాలయం : ఫ్లాట్ నెం. 102, ఒపెల్స్ ది ఐకానిక్, డి. నెం.9-29-7/2, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం - 530003, ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్ నెం.0891-2564450

వెబ్‌సైట్ https://www.ssflimited.com/ , ఇ-మెయిల్: ssflimited@yahoo.co.in

**30 జూన్, 2026తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలు**

ఆడిట్ కమిటీ యొక్క సిఫారసుల ఆధారంగా, మెస్సర్స్ ఎస్ఎస్ఎఫ్ లిమిటెడ్ ("ది కంపెనీ") యొక్క డైరెక్టర్ల బోర్డు వారు గురువారం, 13వ రోజు ఆగస్టు, 2026న జరిగిన వారి సమావేశంలో, 30 జూన్, 2026తో ముగిసిన త్రైమాసికం కొరకు కంపెనీ యొక్క ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాల తోపాటు సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్లు మరియు డిస్‌క్లోజర్ ఆవశ్యకతలు) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 నిబంధనల మేరకు కంపెనీ యొక్క చట్టబద్ధమైన ఆడిటర్లు, మెస్సర్స్ రావ్ & శ్యామ్ వారి ఆడిటర్ల రిపోర్టును ఆమోదించారు.

పైన పేర్కొన్న ఆర్థిక ఫలితాలు https://www.ssflimited.com/ వద్ద కంపెనీ యొక్క వెబ్‌సైట్‌పై అందుబాటులో కలవు. దిగువ ఇవ్వబడిన క్విక్ రెస్పాన్స్ కోడ్ స్కానింగ్ చేయుట ద్వారా కూడా ఫలితాలను మీరు చూడవచ్చు.

డైరెక్టర్ల బోర్డు తరపున మరియు కొరకు
సం/- వి. పద్మనాభం,
మేనేజింగ్ డైరెక్టర్
DIN: 01246827

తేది :13-08-2026
ప్రదేశం : విశాఖపట్నం

**ఆర్‌కెఇసి ప్రాజెక్ట్స్ లిమిటెడ్,** సిఐఎన్ :ఎల్45200ఎపి2005పిఎల్‌సి045795 నమోదిత కార్యాలయము: 10-12-1, 3వ అంతస్తు రెడ్నాం అల్కజర్, రెడ్నాం గార్డెన్స్, ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ఎదురుగా, విశాఖపట్నం 530002, ఫోన్: 0891-2574517, వెబ్‌సైట్: www.rkecprojects.com

RKEC Projects Limited

**30 జూన్, 2026తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్ చేయని స్టాండ్ అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల యొక్క సారాంశం**

(రూ. లక్షలలో, ప్రతి వాటా డేటా మినహా)

| క్ర సం | వివరములు | స్టాండ్ అలోన్ | | | | కన్సాలిడేటెడ్ | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | ముగిసిన త్రైమాసికం కొరకు | | | ముగిసిన సంవత్సరం కొరకు | ముగిసిన త్రైమాసికం కొరకు | | | ముగిసిన సంవత్సరం కొరకు |
| | | 30-06-2026 ఆడిట్ చేయనివి | 31-03-2026 ఆడిట్ చేసినవి | 30-06-2025 ఆడిట్ చేయనివి | 31-03-2026 ఆడిట్ చేసినవి | 30-06-2026 ఆడిట్ చేయనివి | 31-03-2026 ఆడిట్ చేసినవి | 30-06-2025 ఆడిట్ చేయనివి | 31-03-2026 ఆడిట్ చేసినవి |
| 1 | కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం | 1,876.01 | 4,237.25 | 7,655.76 | 18,612.63 | 1,876.01 | 4,237.25 | 7,657.72 | 18,614.60 |
| 2 | నికర లాభం కాలానికి (పన్ను, మినహాయింపదగిన మరియు / లేదా అసాధారణ ఐటంలకు ముందు) | -2,376.38 | -5,659.14 | 455.72 | -4,741.00 | -2,376.38 | -5,659.12 | 457.69 | -4,739.01 |
| 3 | నికర లాభం కాలానికి (పన్నుకు ముందు మినహాయింపదగిన మరియు /లేదా అసాధారణ ఐటంల తర్వాత) | -2,376.38 | -5,659.14 | 455.72 | -4,741.00 | -2,376.38 | -5,659.12 | 457.69 | -4,739.01 |
| 4 | నికర లాభం పన్ను తరువాత కాలానికి (పన్నుకు ముందుమినహాయింపదగిన మరియు /లేదా అసాధారణ ఐటంల తర్వాత) | -1,729.81 | -4,148.43 | 335.19 | -3,470.97 | -1,729.81 | -4,148.41 | 337.16 | -3,468.97 |
| 5 | మొత్తం సమగ్ర ఆదాయం కాలానికి (లాభం / (నష్టం) కాలానికి (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) కలిగి ఉన్నది) | -1,729.81 | -4,148.43 | 335.19 | -3,470.97 | -1,729.81 | -4,148.41 | 337.16 | -3,468.97 |
| 6 | ఈక్విటీ వాటా మూలధనం (ఎఫ్ వి రూ.10 ప్రతి వాటాకు) | 2,582.06 | 2,582.06 | 2,399.00 | 2,582.06 | 2582.06 | 2582.06 | 2,399.00 | 2,582.06 |
| 7 | ఇతర ఈక్విటీ | | | | | | | | |
| 8 | ప్రతి ఈక్విటీ వాటా ఆర్జనలు (ముఖ విలువ రూ.10 చొప్పున) | | | | | | | | |
| | - బేసిక్ (రూ.లలో) | -6.74 | -16.17 | 1.40 | -13.53 | -6.74 | -16.16 | 1.40 | -13.52 |
| | - డైల్యూటెడ్ (రూ.లలో) | -6.74 | -16.17 | 1.40 | -13.53 | -6.74 | -16.16 | 1.40 | -13.52 |

గమనిక : ఎ) సెబీ (ఎల్‌ఓడిఆర్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజీలతో దాఖలు చేయబడిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక నమూనా యొక్క సారాంశం పైన ఇవ్వబడినది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి నమూనా కంపెనీ వెబ్‌సైట్ www.rkecprojects.com మరియు స్టాక్ ఎక్ఛేంజ్ వెబ్‌సైట్ www.nseindia.com పై లభించును.

ప్రదేశం : విశాఖపట్నం
తేది : ఆగస్టు, 14, 2026

పూర్తి ఫలితాల కొరకు క్యూఆర్ కోడ్ దయచేసి స్కాన్ చేయగలరు

డైరెక్టర్ల బోర్డు తరపున మరియు కొరకు
ఆర్. జయచంద్రన్, మేనేజింగ్ డైరెక్టర్